క్లుప్తంగా

ప్రభుత్వ రంగ పరిరక్షణకు సీపీఐ కృషి



స్టీల్‌ప్లాంట్ సెక్టార్‌లో సీపీఐ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఉక్కునగరం: ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు సీపీఐ కృషి చేస్తుందని ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు డి.ఆదినారాయణ అన్నారు. సీపీఐ శత వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక సెక్టార్–1 కాంప్లెక్స్ వద్ద సీపీఐ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 1925 అక్టోబర్ 26న కాన్పూర్ నగరంలో సీపీఐ ఆవిర్భవించిందన్నారు. వందేళ్లుగా సీపీఐ ప్రజల పక్షాన అనేక పోరాటాలు చేసిందన్నారు. ఉక్కు కర్మాగారం నేడు దయనీయ స్థితికి చేరడానికి కారణం కేంద్ర ప్రభుత్వమే అని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు కె.ఎస్.ఎన్.రావు, జె.రామకృష్ణ, కె.రాజబాబు, జి.ఆనంద్, జి.బోసుబాబు, ఎస్.మోహన్‌బాబు, నాయుడు, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

నితీష్‌కుమార్ రెడ్డి సెంచరీపై హర్షాతిరేకం

ఉక్కునగరం: ఆస్ట్రేలియా గడ్డపై భారత క్రికెటర్ నితీష్ కుమార్ రెడ్డి సెంచరీ సాధించడంపై స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు హర్షం ప్రకటించారు. శనివారం సాయంత్రం ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ అగ్ర క్రికెటర్లు విఫలమవుతున్న పరిస్థితుల్లో నితీష్ కుమార్ రెడ్డి ఆస్ట్రేలియా బౌలర్లను దీటుగా ఎదుర్కొని సెంచరీ సాధించడం సాధారణ విషయం కాదన్నారు. నితీష్ కుమార్ రెడ్డి విశాఖ వాసి కావడం విశాఖ ప్రజలకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు మద్ది అప్పలరాజు రెడ్డి, జి.వి.సుబ్బయ్య, మొల్లి ఈశ్వరరావు, ఎస్.ఎ.నాయుడు, కొమ్ము ప్రసాదరావు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



సదస్సులో మాట్లాడుతున్న నోడల్ అధికారి శేష శైలజ

పెదగంట్యాడ: భూ సమస్యలు సత్వర పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని నోడల్ అధికారి శేష శైలజ అన్నారు. పెదగంట్యాడ తహసీల్దార్ అమల ఆధ్వర్యంలో దేవాడ గ్రామానికి సంబంధించి పెదపాలెం సచివాలయం వద్ద శనివారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. వినతులను సకాలంలో పరిష్కరిస్తామన్నారు. వక్ఫ్‌బోర్డు స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారు తమకు ఇంటి పన్నులు వేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయ్ భాస్కర్, నాయకులు కాకి బాబు, పాల అచ్చింనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎంవీఆర్‌లో క్యాంపస్ ఇంటర్వ్యూలు



గ్రూప్ చర్చల్లో పాల్గొన్న అభ్యర్థులు

గాజువాక: వివిధ కంపెనీల్లో ఉద్యోగాల భర్తీ కోసం స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో శనివారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. 15 కంపెనీలు నిర్వహించిన ఈ ఇంటర్వ్యూలో 350 మంది అభ్యర్థులు పాల్గొన్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.1.8 లక్షల నుంచి రూ.4.4 లక్షల వరకు జీతం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వి.వి.కామేశ్వరరావు, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వి.తేజేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వి.కృష్ణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వై.ఈశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

కరెన్సీ.. ప్రేమికుడు

పర్యావరణ ప్రేమికులు
జంతు ప్రేమికుల గురించి విన్నాం.. చదివాం కదా!
ఈయన హాబీ విభిన్నం...

చరిత్ర తెలుసుకోవడానికి నాణేల సేకరించిన అతను.. చివరికి దాన్నే హాబీగా మార్చుకున్నారు. ఇంకే ముంది దాదాపు 220 ఏళ్ల నుంచి చెలామణిలో ఉన్న నాణేలు, కరెన్సీ సేకరించాడు.. ఆర్‌బీఐ ఏ కొత్త కరెన్సీ దించినా సత్తిబాబు చెంతకు చేరుతుందంటే అతిశయోక్తి కాదు. **తన హాబీ అయిన నాణేలు, కరెన్సీ సేకరణ కోసం ఏకంగా రూ.5 లక్షల వరకూ ఖర్చు చేశారు. మరెందుకు ఆలస్యం... ఆయన వద్ద ఉన్న కరెన్సీ కలెక్షన్ గురించి చదివేద్దాం పదండి..**





1845 నుంచి వాడకంలోకి వచ్చిన కాయిన్లు



ఆంగ్లేయుల కాలంలోని బ్రిటిష్‌రాణి, గవర్నర్ జనరల్ ముఖ చిత్రాలతో నాణేలు

- చిల్లి గవ్వ నుంచి చిల్లర నాణేల వరకూ
- అణా పైసా నుంచి రూ.500 వరకూ సేకరణ
- కాయిన్స్, కరెన్సీ కలెక్షన్ కింగ్ సత్తిబాబు

SUNDAY SPECIAL

అగనంపూడి: చిల్లి గవ్వ, టోలీలు, దమ్మిడీలు, కాసులు,గుర్రం కాసులు, కన్నం కాసులు, 64 కాసులు,అర్ధ అణాలు,16 అణాలు, పావలా,అర్ధ రూపాయి.. రూపాయి.. రెండు రూపాయలు ఒకప్పుడు భారతదేశ మారక ద్రవ్యంగా చలామణి అయిన రోజులు. వీటి గురించి మీకు ఎంతమందికి తెలుసు!. రూపాయి మారకద్రవ్యంగా లేని రోజుల నుంచి నేటి నాణేలు.. నోట్లు ఒకరి అభిరుచి వల్ల చూసే అవకాశం కలిగితే ఆ అనుభూతి వేరే కదా.. భారత దేశ కరెన్సీతో పాటు వివిధ దేశాల కరెన్సీ , నాణేలు సేకరించడమే అలవాటుగా చేసుకున్నారు సిరపనశెట్టి సత్తిబాబు.

ఆదాయంలో కొంత కరెన్సీ సేకరణకు

తన టెంట్‌హౌస్ నిర్వహణ ద్వారా ఇచ్చిన ఆదాయంలో కరెన్సీ సేకరణకు ఖర్చు చేశారంటే ఆయన అభిరుచి, అనుభూతి చెప్పలేనిది. చదువుకొనే రోజుల్లో నాణేలు, నోట్లు సేకరించాలనే ఆలోచన వచ్చిన సత్తిబాబు వాటిని అలాటుగా మార్చుకున్నారు. 1800 నాటి నాణేల నుంచి నేడు చలామణిలో ఉన్న కరెన్సీ వరకు సేకరించారు.

చిల్ల గవ్వ నుంచి రూపాయి వరకూ..

1803లో నేటి రూపాయికి సమానమైన చిల్లి గవ్వ చెలామణిలో ఉండేది. ఇది సుమారు 1930 వరకు చెల్లుబాటు అయింది. 1803లోనే రూపాయికి సమానమైన 364 టోలీ కూడా అందుబాటులో ఉండేది. 1831 నుంచి దమ్మిడీలు, 1853లో 192 దమ్మిడీలు (అరపైసా), 1950లో 64 గుర్రం కాసులు, 1943లో 64 కన్నం కాసులు 1835లో 64 కాసులు (పావు అణా) అదే ఏడాది 32 అర్ధ అణాలు (అర్ధ అణా), 1906లో 16 అణాలు, 1841లో 8 బేడలు, 1835లో పావలా, అదే సంవత్సరం అర్ధ రూపాయి, రూపాయి, భారతదేశ కరెన్సీగా చెలామణిలోకి వచ్చాయి.



వివిధ దేశాలు విడుదల చేసిన డిజిటల్ నాణేలు

చరిత్ర తెలుసుకోడానికి ప్రారంభించి...



చదువుకునే రోజుల్లో నాణేలు, నోట్లు చరిత్ర తెలుసుకోడానికి వాటిని సేకరించడం మొదలు పెట్టాను. ఆ తర్వాత నాటి, నేటి కరెన్సీ ఎలా ఉండేదో భావితరాలకు చూపించాలనే ఆసక్తితో అలవాటుగా మారిపోయింది. దీంతో ఆర్‌బీఐ విడుదల చేసే ప్రతీ కరెన్సీ, కాయిన్ కోసం డబ్బులు ఎంత అని చూడకుండా సేకరించడం అలవాటు చేసుకున్నా. డబ్బులు ఖర్చు అవుతున్నాయనే ఆలోచన లేకుండా తాను సేకరిస్తుంటే ఇంట్లోవారు కూడా సహకరించారు. వారి సహకారంతో ఇంత పెద్ద మొత్తంలో నాణేలు, కరెన్సీ సేకరించి భద్రపర్చాను.

– సిరపనశెట్టి సత్తిబాబు, వడ్లపూడి

స్వాతంత్య్రం వచ్చిన తర్వాత

భారతదేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత కరెన్సీ నోట్ల ముద్రణలో అనేక మార్పులు వచ్చాయి. అప్పటి నుంచి విడుదల చేసి రూ.10, రూ. వెయ్యి వరకూ ఆర్‌బీఐ విడుదల చేసిన అన్ని నాణేలు సేకరించారు.87వ వార్డు వడ్లపూడి అరుణా సప్లయర్స్ అధినేత సత్తిబాబు. అలాగే రిజర్వ్ బ్యాంక్ ప్రత్యేక సందర్భాలు, జయంతి వేడుకలు, దినోత్సవాలు, వార్షికోత్సవాలు, రజతోత్సవాలు, సర్ణోత్సవాలు సందర్భంగా జాతీయోద్యమ నాయకులు, అగ్రగణ్యుల పేరు,వారి చిత్రాలతో ముద్రించిన నాణేలు, పక్షులు, జంతువుల రూపాలతో విడుదల చేసిన కరెన్సీని సత్తిబాబు సొంతం చేసుకున్నారు. ఇలా వందల కొద్ది నాణేలు... నోట్ల సేకరణను కళగా మార్చుకున్నారు.



2010లో విడుదల చేసిన 75 రూపాయల నాణెం

అరుదైన నాణేల కోసం వేలల్లో ఖర్చు

అరుదైన పక్షులు, జంతువులు నాణేల ముఖచిత్రంతో ముద్రించిన నాణేల కోసం ఒక్కో సమయంలో రూ. 6 వేల నుంచి 8వేల వరకు ఖర్చు చేశారు. భారత రిజర్వ్ బ్యాంక్ విడుదల చేసిన నాణేలు, నోట్లన్నీ ఆయన సేకరించారు. అంతేకాకుండా వివిధ దేశాలు ప్రత్యేక సందర్భాల్లో విడుదల చేసిన కరెన్సీ నోట్లు, డిజిటల్ ప్రింటింగ్‌తో నాణేలను ఆయన అధిక మొత్తంలో చెల్లించి కొనుగోలు చేశారు.



పక్షుల ముఖ చిత్రాలతో విడుదల చేసిన నాణాలు

శనీశ్వరాలయాలకు పోటెత్తిన భక్తులు



అక్కిరెడ్డిపాలెంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



నవగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు ఉమారామలింగేశ్వర ఆలయ ప్రాంగణంలోని శనీశ్వరాలయంలో శనివారం శనిత్రయోదశిని పురస్కరించుకొని నవగ్రహాలకు భక్తులు పూజలు నిర్వహించారు. శనికి నవధాన్యాలు, తైలాలతో అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో శ్రీ రామలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు బాలచెరువు శివాలయంలో కొలువైన శనైశ్చరుడికి శనివారం శనిత్రయోదశి సందర్భంగా ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయ అర్చకుడు వాసుదేవ శర్మ ఆధ్వర్యంలో నవగ్రహాలకు నిర్వహించిన పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అన్నదాన మూల నిధికి విరాళాల అందజేత



తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ప్రతినిధులకు విరాళాలు అందజేస్తున్న దాతలు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రీవారి అన్నదాన మూల నిధికి పలువురు దాతలు శనివారం విరాళాలు అందజేశారు. గోపాలపట్నంకు చెందిన చిన్న రాజు, రమాదేవి దంపతులు రూ.10,116, షీలానగర్ లెజెండ్ అపార్ట్‌మెంట్‌క చెందిన గోపాలరావు, స్వాతిల కుమారుడు కౌషిక్‌లు రూ.10,000, గాజువాక విశ్వేశ్వరయ్యనగర్‌కు చెందిన వెంకటేశ్వరరావు, సునీత దంపతులు రూ.5000 ఆలయ ప్రతినిధులకు అందజేశారు.

క్రికెట్ టోర్నమెంట్ లోగో ఆవిష్కరణ

అక్కిరెడ్డిపాలెం: జనవరి 10,11,12వ తేదీల్లో దిహర్ట్ ఫుల్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బీహెచ్‌పీవీ విశ్రాంత ఉద్యోగుల కుటుంబాల క్రికెట్ టోర్నమెంట్‌ను భెల్ క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. టోర్నీ లోగోను శనివారం భెల్ గుర్తింపు యూనియన్ కార్యాలయం వద్ద సినీ నటుడు ప్రసన్న కుమార్ ఆవిష్కరించారు. టోర్నమెంట్‌లో 8 జట్లు పాల్గొననున్నాయి. డ్రాను నటుడు ప్రసన్నకుమార్, సెలబ్రిటీ డ్యాన్స్‌మాస్టర్ రమేష్ కుమార్ నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ గుర్తింపు యూనియన్ ప్రతినిధులు బొండ బాబూరావు, సుభాకర్ సాహలా, పి.వి.ఎస్.రాజు, కొల్లి దేముడు, రామ్‌జానే తదితరులు పాల్గొన్నారు.



లోగోను ఆవిష్కరిస్తున్న సినీ నటుడు ప్రసన్న కుమార్

స్మార్ట్ ఎనర్జీ మీటర్ టెక్నీషియన్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో స్మార్ట్ ఎనర్జీ మీటర్ టెక్నీషియన్ కోర్సులో శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లమో పూర్తి చేసి 18 నుంచి 45 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. మూడు నెలల పాటు పెదగంట్యాడలోని న్యాక్ కార్యాలయంలో శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు 8309003957 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు. శిక్షణ కాలంలో ఉచితంగా స్టేషనరీ, మధ్యాహ్న భోజనంతో పాటు శిక్షణ పూర్తి చేసిన వారికి రూ.7,500 స్టైఫండ్ ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం ప్రైవేటు సెక్టార్లలో ఉపాధి కల్పిస్తామని పేర్కొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలకు స్పెషల్ డ్రైవ్

గాజువాక: సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కోసం గాజువాక పీహెచ్‌సీ వైద్యాధికారులు శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. టీకాలు మిస్ అయిన ఏడాదిన్నర లోపు చిన్నారుల కోసం ఈ 31వ తేదీ వరకు డ్రైవ్ నిర్వహించనున్నట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం.సుధాకర్ తెలిపారు. వ్యాక్సిన్ మిస్ అయిన చిన్నారులను ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు గాజువాక పీహెచ్‌సీకి తీసుకొచ్చి టీకా వేయించుకోవాలన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా కుంచుమాంబ కాలనీ, మెహర్ నగర్, చినగంట్యాడ ఎస్సీ కాలనీలలో సెషన్లను నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సామాజిక ఆరోగ్యాధికారి పి.నాగఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారికి టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

భద్రత, పొదుపుపై అవగాహన అవసరం

అక్కిరెడ్డిపాలెం: గ్యాస్ వినియోగంలో భాగంగా భద్రత, పొదుపుపై అవగాహన కలిగి ఉండాలని భెల్ (హెచ్‌పీవీపీ) ఎంప్లాయీస్ కన్జ్యూమర్స్ కో ఆపరేటివ్ స్టోర్స్ (ఈసీసీ) డైరెక్టర్లు అన్నారు. భద్రత, పొదుపు అనే అంశాలపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్యాస్ లీకేజీ వల్ల నష్టాలు, వినియోగం తర్వాత సిలెండర్‌ను ఎలా వినియోగించాలి, గ్యాస్ పొదుపు వంటి అంశాలతో పాటు, గ్యాస్ లీకై నప్పుడు ప్రమాదం సంభవిస్తే ఎలా నివారించాలో అనే అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఈసీసీ ప్రతినిధులు బి.రవీంద్రబాబు, కరణం దేముడు, ప్రసాద్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

యువకుడిపై ఆగంతకుల దాడి

సిల్వర్ చైన్, నగదు దోపిడీ

ఉక్కునగరం: జాతీయ రహదారికి దగ్గరలో మూత్ర విసర్జనకు వెళ్లిన యువకుడి మెడపై కత్తి పెట్టి మరీ నగదు దోపిడీ చేసిన సంఘటన కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ ఆర్చి సమీపంలో జరిగింది. సీనీఫక్కీలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్టీల్‌ప్లాంట్ క్రైం పోలీసులు అందించిన వివరాలు.. వడ్లపూడి కాలనీకు చెందిన కర్రి మహేష్ (25) నగరంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పని చేస్తున్నారు. శుక్రవారం రాత్రి స్టీల్‌ప్లాంట్ రహదారిలోని పెట్రోల్ బంక్‌కు వెళ్లి పెట్రోలు వేయించారు. తిరిగి వస్తుండగా ఆర్చి సమీప పార్కింగ్ స్థలం వద్ద బండి ఆపి మూత్ర విసర్జనకు వెళ్లాడు. వెనుక నుంచి వచ్చిన ఒక ఆగంతకుడు మెడపై కత్తి పెట్టాడు. మరో వ్యక్తి వచ్చి మహేష్ మెడలోని సిల్వర్ చైన్ లాక్కున్నాడు. ఆ తర్వాత నలుగురు వ్యక్తులు పక్కన ఉన్న పొదల నుంచి వచ్చి మహేష్‌ను లాక్కెళ్లారు. అక్కడ అతన్ని కొట్టి రూ. లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో మహేష్ తన తల్లికు ఫోన్ చేసి విషయం చెప్పారు. ఆమె సంఘటనా స్థలానికి వచ్చి రూ. 5 వేలు ఇచ్చారు. మహేష్ సహోద్యోగి రూ. 2 వేలు పంపారు. ఆగంతకులు మహేష్ నుంచి సిల్వర్ చైన్‌తో పాటు రూ. 7250 దోచుకు వెళ్లిపోయారు. ఈ సంఘటనలో మహేష్‌కు కుడి భుజం, పెదవులపై గాయాలయ్యాయి. అతుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్టీల్‌ప్లాంట్ పోలీసులు మహేష్‌ను చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. జోన్–2 క్రైం ఏసీపీ లక్ష్మణరావు, సీఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలంలో విచారణ చేపట్టారు. స్టీల్‌ప్లాంట్ క్రైం ఎస్ఐ రుక్మాంగధరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

10 నుంచి క్రికెట్ లీగ్



లీగ్ మ్యాచ్‌లకు డ్రా నిర్వహిస్తున్న కార్పొరేటర్, నాయకులు, నిర్వాహకులు

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి యూత్ ఆధ్వర్యంలో వచ్చేనెల 10 నుంచి ఐదు రోజుల పాటు నిర్వహించనున్న సంక్రాంతి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో పాల్గొనే జట్లకు డ్రా నిర్వహించారు. వడ్లపూడిలోని ఓ కన్వెన్షన్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథం, వైఎస్సార్‌సీపీ గాజువాక మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి ప్రగడ వేణుబాబు డ్రా తీసి అనంతరం ట్రోఫీలను ఆవిష్కరించారు. క్రీడాస్ఫూర్తితో ఆడాలని సూచించరాఉ. కార్యక్రమంలో నిర్వాహకులు బొడ్డ రామకృష్ణ, ప్రగడ ఉమా ప్రసాద్, బొడ్డ రాజు, ప్రగడ మణిశంకర్, దుప్పట సంతోష్, బొడ్డు ముద్దునాయుడు, బొడ్డ సన్యాసిరావు, సూరిబాబు, ఇందిరా ప్రియదర్శిని పాల్గొన్నారు.

గురుస్వామి వెంకటరమణకు సన్మానం

అక్కిరెడ్డిపాలెం: స్వామి అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నిత్య అన్నదానం ముగింపు కార్యక్రమంలో భాగంగా సేవా సంఘం అధ్యక్షుడు అదపాక వెంకటరమణను శనివారం సేవా సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఎటువంటి ఆటంకాలు లేకుండా అయ్యప్ప మాలధారణతో పాటు ఇతర మాలధారణ భక్తులకు అన్నదానం చేపట్టడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు సీహెచ్.మురళీశ్వరరావు, నాగోలు రవికుమార్, ఆళ్ల బూలిరాజు, పాలమరశెట్టి బూలిరాజు, ఎస్.ఏ.నాయుడు, మెడికల్ జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.



గురుస్వామి వెంకటరమణను సన్మానిస్తున్న స్వామి అయ్యప్ప సేవా సంఘం ప్రతినిధులు

ప్రతిభకు పురస్కారం

పెదగంట్యాడ: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన హోం గార్డ్ ప్లటూన్ కమాండర్ చౌదరి గణపతిరావుకు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి శనివారం ప్రశంసా పత్రం అందజేశారు. హార్బర్ జోన్ పరిధిలోని న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న గణపతి రావుకు నగదు రివార్డు కూడా అందజేసి అభినందించారు.



సీపీ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న గణపతిరావు